క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థినులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల/బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థినులకు తెలుగు పండిట్ రహీం షేక్‌లాల్ శనివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సుమారు రూ.6,000 ఖర్చు చేసి కొనుగోలు చేసిన నోట్ పుస్తకాలను హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు ఉపాధ్యాయులతో కలిసి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థినులకు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్లస్‌టూ కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


విద్యార్థినులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: విద్యార్థులు పాఠశాలస్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని ఎంఈఓ బాలభాస్కర రావు చెప్పారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశా లలో విద్యార్థినులకు శనివారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ పిల్లలతో సమానంగా బాలికలు చదువుకునేందుకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని చెప్పా రు. ప్రభుత్వ ప్రోత్సాహంతో బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

చెరువు గట్టు పరిశీలన


చెరువుగట్టుపై క్రషర్ యజమాని వేసిన రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యం, రెవెన్యూ ఉద్యోగులు

వేపాడ: మండలంలోని వావిలపాడు రెవెన్యూలో కుబిరెడ్డివాని చెరువు గట్టుపై ఓ క్రషర్ యజమాని అక్రమంగా రోడ్డు నిర్మిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ సత్యం, రెవెన్యూ ఉద్యోగులు ఆ చెరువుగట్టును శనివారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చెరువుగట్టుపై నుంచి ఓ క్రషర్ యజమాని రోడ్డు వేస్తున్నట్లు గతంలో సమాచారం రాగా, అప్పుడే ఆ పనులను నిలిపి వేయించామని చెప్పారు. జేసీ ఆదేశాలమేరకు మరోసారి పరిశీలించామని, చెరువు హద్దులు నిర్ధారించామని పేర్కొన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ఉప తహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామ లక్ష్మి, మండల సర్వేయర్ అప్పలనాయుడు స్థానిక వీఆర్‌ఓ, సర్వే యర్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జామి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తిరుమలరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవు తుందని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ


వేపాడ: సోంపురం హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ బాలభాస్కరావు, హెచ్‌ఎం రాజు

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓ బాలభాస్కరరావు, హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు శనివారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. రోజూ యూనిఫాం, టై, బూట్లు ధరించి స్కూల్‌కి రావాలని చెప్పారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

శతశాతం సరఫరా పూర్తి

గజపతినగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్ల సరఫరా శతశాతం పూర్తి చేశామని ఎంఈఓలు విమలమ్మ,సాయి చక్రధర్ తెలిపా రు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 56 పాఠశాలలకు స్టూడెంట్ కిట్లను సరఫరా చేశామ ని, వాటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థులకు అందజేయాలని సూచించారు. సీఆర్పీలు నారాయణరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పూర్వవైభవానికి కృషి చేద్దాం

- ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ పూర్వవైభవానికి అంతా కలిసి కృషి చేద్దామని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని తన కార్యాలయం వద్ద మండల వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వైఎస్సార్‌సీపీకి గ్రామాల్లో పటిష్ట ఓటు బ్యాంకు ఉందని, ఓటమి చెందామని భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంద ని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తకు, ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలి పారు. వైఎస్సార్‌సీపీ ఓటమి చెందినప్పటికీ సుమారు 40శాతం ఓట్లు సాధించిందని చెప్పారు. ఎక్కడ పడిపోయామో అక్కడ నుంచే మళ్లీ పుంజుకొని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు తనతో పాటు పార్టీ పెద్దలు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, తమ పూర్తిసహాయ సహకారాలు ఉంటాయని, చెప్పారు. అనంతరం రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ ఓటమితో కుంగిపోరాదని, దాన్ని సవాల్‌గా స్వీకరించి రానున్న రోజుల్లో ముందుకు సాగుదామన్నారు.గ్రామాల్లో మన పార్టీ ఎంపీటీసీ సభ్యులు, పార్టీ సహకారంతో గెలిచిన సర్పంచ్‌లు ఉన్నారని అన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకుల కవ్వింపులకు దిగినా తొందరపడవద్దని హితవు పలికారు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు


జామి: పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి


దత్తిరాజేరు: దత్తి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

జామి: పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు అర్చకులు అభిషేకాలు చేసి, అనంతరం విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో స్వామివార్లకు పూజలు చేయించారు.

దత్తిలో..

దత్తిరాజేరు: జ్యేష్ఠ శుద్ధ నవమి సందర్భంగా మండలంలోని దత్తి గ్రామంలో శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు,లక్ష్మీ దంపతులతో అర్చకులు కృష్ణమూర్తి స్వామి వారికి పూజలు చేయించారు. అనంతరం చుట్టు పక్క గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రాజరాజేశ్వరీదేవి ఆలయంలో...


బొండపల్లి: దేవుపల్లిలో పూజలందుకుంటున్న రాజరాజేశ్వరీదేవి

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో జ్యేష్ఠ నవమిని పుర స్కరించుకొని అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి, పట్టు వస్త్రాలతో అలంక రించి కుంకుమ పూజలు చేశారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు రక్తదాన శిబిరం

గజపతినగరం స్థానిక మెంటాడ జంక్షన్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ కార్యదర్శి సాయిరేవంత్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈశిబిరంలో రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. ముల్లు తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు

రాయితీపై వరి విత్తనాల పంపిణీ


రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గరివిడి మండలం తాటిగూడ గ్రామంలో రైతులకు మండల ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, నాయకులు శనివారం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావుమాట్లాడుతూ గరివిడి మండలంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 7,000 ఎకరాలు అని చెప్పారు. రైతులకు పంపిణీ చేసేందుకు 21 రైతు భరోసా కేంద్రాల్లో 1,197 క్వింటాళ్ల ఎంటీయూ–1121 రకం వరి విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. మిగిలిన రకాలు 150 క్వింటాళ్లు అందుబాటులోకి వస్తాయని చెప్పా రు. ఎంపీపీ మీసాల మీసాల విజయలక్ష్మి, జె డ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు , ఏడీఏ ఎన్ కోటేశ్వర రావు, ఏఓ శైలజ, టీడీపీ నాయకులు పైలా బల రాం, సా రిపాక సురేష్ బాబు, విసినిగిరి శ్రీను పాల్గొన్నారు.

అప్రెంటీస్‌షిప్‌కు 33 మంది ఎంపిక

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని వీటి అగ్రహారంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో శనివారం మేథో సర్వో అప్రెంటీస్ షిప్ క్యాంపస్ డ్రైవ్‌లో 33 మంది ఎంపికయ్యారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ జి.రామాచారి, ఇతర సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇప్పటికే ఐటీఐ ట్రేడ్‌లు పాసైన వారికి, 2024 విద్యాసం వత్సరం ట్రైనింగ్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులను సైతం ఈ క్యాంపస్ డ్రైవ్‌లో అప్రెంటీస్‌కు ఎంపిక చేశారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టండి


వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వాటిని చేపట్టాలని ఎంపీడీఓ ఎస్.హరిహర రావు ఉపాధి హామీ పథకం ఏపీఓ బి.కృష్ణవేణి, సిబ్బందికి సూచించారు. మండలంలోని ఒంపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం అందుతుందని చెప్పారు. ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ రైతుల పొలాలకు వెళ్లే మార్గాలను అభివృద్ధి చేసే పనులతో పాటు, చెరువు గట్లు పటిష్టం చేయడం, ఉద్యానవన పంటలకు సంబంధించిన పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాబ్ కార్డులు లేని వారందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, ఉపాధి హామీ పథకం ద్వారా ఇంత వరకు ఎంత నిధులు మంజూరయ్యాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

ఈదురుగాలులతో వర్షం

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం


శృంగవరపుకోట: గాలుల దాటికి ఎస్.కోటలో విద్యుత్ లైన్ మీద విరిగి పడిన చెట్టు కొమ్మ


గంట్యాడ: పెదమధుపాడలో నేలకొరిగిన అరటిపంట


మెరకముడిదాం: మెరకముడిదాంలో ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం

శృంగవరపుకోట: మండల వ్యాప్తంగా శనివారం ఈదురు గాలులతో కురిసిన వర్షం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కురిసిన వర్షానికి బలమైన గాలులు తోడవ్వడంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. పలు గ్రామాల్లో కూలిన చెట్లు, పిడుగులు ప్రజల్ని భయభ్రాంతుల్ని చేశాయి.

రెండు రోజులుగా చీకటిలో..

చామలాపల్లి గ్రామం రెండు రోజులుగా చీకట్లోనే ఉంది. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన గాలివానకు మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే చామలాపల్లి గ్రామానికి మాత్రం విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. దీంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్‌శాఖ సిబ్బందికి, ఉద్యోగులకు ఫోన్ చేసినా ఎవ్వరూ స్పందించడం లేదని ఆగ్రామ సర్పంచ్ జుత్తాడ సూర్యారావు వాపోయారు. తమ చుట్టూ ఉన్న గ్రామాలకు కరెంటు ఇచ్చిన అధికారు లు తమ గ్రామాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారులు స్పందించి కరెంటు సరఫరా పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎల్.కోట,కొత్తవలస మండలాల్లో భారీ వర్షం

లక్కవరపుకోట/కొత్తవలస: కొత్తవలస,లక్కవరపుకోట మండలాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం నువ్వు పంటకు, వరి నారుమడుల తయారీకి ఎంతో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. ఈదురుగాలి కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాల ఇన్సులేటర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నేలకొరిగిన అరటితోటలు

గంట్యాడ: మండలంలో శుక్ర, శనివారాల్లో వీచిన ఈదురుగాలులకు చినమధుపాడ, పెదమధుపాడ గ్రామాల్లో అరటితోటలు నేలకొరిగాయి. సుమారు 20 ఎకరాల్లో అరటి పంట దెబ్బతిం దని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరా లేక అవస్థలు

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా శుక్రవారం, శనివారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు వివిధ గ్రామాల్లో 17 విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పెదమానాపురం, కోమటిపల్లి, ఇంగిలాపల్లి, వంగర, మరడాంతో పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మెరకముడిదాంలో భారీ వర్షం

మెరకముడిదాం: మండల కేంద్రంతో పాటు సోమలింగాపురం, ఎం.పాలెం, బుధరాయవలస, గర్భాం, ఉత్తరావల్లి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. వరి నారు మడులు సిద్ధం చేసుకునేందుకు ఈవర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


పాల్లంకిలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఓపీ పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు


గంట్యాడ పీహెచ్‌సీలో మందుల నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

గంట్యాడ: విధుల్లో అలసత్వం వహించే వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ భాస్కర రావు హెచ్చరించారు. మండలంలోని పాల్లంకి గ్రామంలో శని వారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలకు సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఎవరైనా గైర్హాజ రు అయితే కఠిన చర్యలు తప్పవన్నారు. శిబిరాలకు వచ్చే ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు చేసి వారికి చికిత్స, అవసరమైన మందులు ఉచితంగా అందించాలని సూ చించారు. అనంతరం ఆయన గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించారు. వర్షాలు కురుస్తు న్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. బీసీజీ వ్యాక్సినేషన్ శతశాతం పూర్తి చేయాలని చెప్పారు. ఆయన వెంట ఎపిడిమాలజిస్టు డాక్టర్ వెంకటేష్, వైద్యాధికారులు పల్లవి,హేమలత , ఎంపీహెచ్ ఈఓలు ఎర్రన్న, చంద్రశేఖరరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యరాజ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ


రాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

శృంగవరపుకోట: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్న మండా రాజు కుటుంబా న్ని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం పరా మర్శించారు. రాజు తండ్రి వెంకటరమణ ఇటీవల మరణించారు. ఆయన పెద్ద పెద్దకర్మను మండలంలోని శివరామరాజుపేటలో నిర్వహించారు. కార్యక్రమానికి పలువురు పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కడుబండి హాజరయ్యారు. రాజు కుటుంబాన్ని పరామర్శించి, మృతుడు వెంకటరమణ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించా రు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకట రమణ, నాయకులు వాకాడ రాంబాబు, కె.వెంకటరావు, రంధి అనంత్, వాకాడ సతీష్, పినిశెట్టి సుధాకర్, దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలకు డిమాండ్


జామిలో ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

జామి: మండలంలో ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్, డీపీఆర్‌టీయూ సంఘాల నేతలు డీఈఓ ప్రేమ్‌కుమార్, ఎంఈఓలు జయశ్రీ, గంగరాజుకు శనివారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. జామిలో రెండు, కుమరాంలో ఒక పాఠశాల గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపించారు. వీటి వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు తగ్గుతున్నాయని, ఈపాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు వి.వాసుదేవరావు, ఎం.తాతంనాయు డు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర డైరెక్టర్ పదవికి రాజీనామా


బెవర ఉమాకుమారి

చీపురుపల్లి: ఏపీ తూర్పుకాపు సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు బెవర ఉమాకుమారి శనివారం తెలిపారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఆన్‌లైన్ ద్వారా బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీకు పంపించినట్లు చెప్పారు. రాష్ట్ర కార్పొరేషన్‌లో చైర్మన్ నుంచి డైరెక్టర్ల వరకు అందరూ తమ రాజీనామాలు పంపించినట్లు పేర్కొన్నారు. తూర్పుకాపు సంక్షేమం, అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తూర్పుకాపులకు ఎంతో మేలు చేశారని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన తమ పదవులకు రాజీనామా చేశామని, పార్టీ అభివృద్ధి కోసం ఆయన అడుగుజాడల్లో నడుచుకుంటామని పేర్కొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


రామాంజనేయకాలనీ ఉన్నత పాఠశాలలో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న రమణ

చీపురుపల్లి: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత, రామాంజనేయకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తక పఠనంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశయ రూరల్ లైబ్రరీ ద్వారా విద్యార్థుల చెంతకే పుస్తకాలు అనే కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పుస్తకపఠనం అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఖాళీ సమయాల్లో మొబైల్, టీవీలంటూ విలువైన సమ యాన్ని వృథా చేయకుండా నీతి కథలు, మహనీయుల జీవిత చరిత్ర, సైన్స్, సాంకేతిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు చదవాలని సూచించారు. రామాంజనేయకాలనీ పాఠశాల హెచ్‌ఎం కంది గోపి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో అలంకరణ సామగ్రి


వ్యర్థాలతో సుందర ఆకృతులను తయారు చేసిన ప్రమీలను అభినందిస్తున్న కమిషనర్, ఫ్లోర్ లీడర్ రాజేష్


ప్రమీల తయారు చేసిన వివిధ ఆకృతులు

విజయనగరం: వ్యర్థాలతో వివిధ అలంకరణ వస్తువుల తయారీకి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం పిలుపు ఇచ్చింది. కమిషనర్ ఎం.ఎం.నాయుడు రీసైకిల్, రీయూజ్, రీడ్యూస్ విధానంపై ప్రజారోగ్య విభాగం, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. నూతన ఆవిష్కరణలకు పిలుపునిచ్చారు. దీనికి స్పందించిన నగరంలోని 5వ నంబర్ సచివాలయానికి చెందిన ప్రమీల అనే పర్యావరణ కార్యదర్శి పాడిచెత్త నుంచి వచ్చిన ప్లాస్టిక్ వస్తువులు, ఖాళీ వాటర్ డ్రింక్ బాటిల్స్, అట్టలతో పెన్ స్టాండ్లు, పూల కుండీలు, షోకేస్ బొమ్మలను తయారు చేశారు. వీటిని కమిషనర్‌కు అందజేశారు. వాటిని చూసిన ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేష్ కార్యదర్శిని అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం.ఎం.నాయుడు మాట్లాడుతూ వ్యర్థాల నుంచి వినిమయ వస్తువులు రూపొందించాలని ఇచ్చిన పిలుపునకు కార్యదర్శులు స్పందించి వివిధ ఆకృతులు తయారు చేయడం ఆనందంగా ఉందన్నారు. వాటిని రూపొందించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ వస్తువులను మెప్మా ద్వారా ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తామన్నారు. వ్యర్థాలతో వివిధ ఆకృతుల తయారీపై శిక్షణతో పాటు, రూపొందిన వస్తువుల ప్రదర్శన వంటివి నెలకొల్పడమే లక్ష్యంగా పేర్కొన్నారు.